# ముళ్లచెట్టూ కమ్మని పువ్వూను

'అబ్బాయీ, పెద్దముండ నాట్టే పేలించక యీపాటికి కాస్త కూకలేసుకో. ఎంతటివాళ్లయినా లోకానికి కసింత వెరవాలి"

"ఏమి వచ్చిం దమ్మా యిప్పుడు?"

"నన్నడుగుతున్నావా కోడై కూస్తూ వుండగా?"

"పైవాళ్ల మాటలు నువ్వు చెప్పినంత నిర్ధారణగా వుండవుగా?"

"అపయితే నేనే చెబుతాను, నాకేం చెప్పక? అయితే, యెన్నని చెప్పను?"

"ఉండడమే వస్తే ఉన్నవన్నీ చెప్పాలి"

"ఉండడమే వస్తే" అంటే? ఉన్నా యనా లేవనా?"

"నేను చూశానా?"

"చూడనూ చూడక, విననూ వినక మరేమి చేస్తున్నావు?"

"ఉదయం పది కాకుండానే ఆఫీసుకి పోవాలి గదా——"

"గౌరవం గంగలో కలిసిపోతూ వుంటే నువ్వది కాపాడుకో వద్దూ? ఆఫీ సెక్కువా, కుటుంబగౌరవం యెక్కువా?"

"నువ్వు చక్కబెట్టవలసినదానవు కాదా, పోనీ అంటే సంగతి సందర్భాలు నాకు చెప్పవలసిన పూచీ నీకు లేదా?"

"నువ్విలా వెనకవేసుకువస్తూ వుంటే అది నన్నిక లక్ష్యపెడుతుందా?"

"జరిగిం దేమిటో చెప్పమంటే సోది మొదలుపెడతా వేమిటమ్మా?"

"నామాటలు సోదికిందే కట్టేశావు గదా? బాగుంది నాయనా!"

"సోది కాకపోతే మరి జరిగిపోయిన అకార్యకరణం యేమిటయినట్టు?"

"ఒక్కటనా రెండనా చెప్పడానికి?"

"ఉన్నవన్నీ చెప్పు, కొన్ని విడిచిపెట్టడం యెందుకూ?"

"నీకు మానాభిమానాలే వుంటే వొక్కటి చాలదూ, నా వెర్రి కానీ?"

"............"

"నిన్ననడం యెందుకూ? ఈడనా లలాంటివి. పూర్వకాలపు మనిషిని నే నెంత మొత్తుకుంటే మాత్రం యేమిషీ?"

"ఏమి జరిగిందో చెప్పలేవు. ఊరుకోనూ లేవు"

"చెప్పలేకపోడం ఖర్మం యేమిటా? చూసిందీ విన్నదీ చెప్పలేకపోడానికి నేనేం కల్పన చెయ్యాలా? క్షణానికో క్షణానికో బూడిద అయిపోయే దానికి నా కెందు కని గానీ—కళ్లారా చూస్తూ వూరుకోలేకా యీపాట్లు. మాటిమాటికీ నువ్వు చెప్పు దెబ్బలు కొడుతూనే వున్నావు. అయినా, కన్నకడుపు. బిడ్డలున్నవాళ్లకే గాని నామాతన బోధపడదులే. నువ్వెంత తీసి పారేస్తూ వుండినా నీ కపకీర్తి వస్తూ వుంటే చూడలేకుండా వున్నాను, కనక, నువ్వు నన్నిలా అనవలసిందే. ఎందుకులే? పడ్డవాళ్లెప్పుడూ చెడ్డవాళ్లు కారులే"

"అందరూ అంతేనా ?"

"ఏకర్మమూ యెరగనివాళ్లంతే"

"ఎరిగినవాళ్లెవరో, ఆయెరిగివున్న దేమిటో చెప్పరాదూ ?"

"మేలుకునే వుండి కళ్లు మూసుకున్నవాళ్లని లేపడం యెవరి తరం నాయనా ?"

"............"

"పీసపాటివారి యింటో పుట్టాను, కల్లూరివారి యింటో పడ్డాను. రెండూ కూడా వోహో అనిపించుకున్న వంశాలే. అంచేత కాని, కులంతక్కువదాన్నయితే నాకీ గుంజాటన యేం ?"

"ఇక్కడ కులంతక్కువవాళ్లెవరూ ?"

"ఎవళ్లయితే మాత్రం నాకెందుకూ ?"

"ఇంకేం ? అలా అని మనస్సుకి సమాధానం చెప్పుకో. ఎప్పుడేమనిపోతారో అని కుర్రాళ్లు భయపడేలాగ—"

"నేనదే చెబుతున్నాను"

"నువ్విలా తొందరమాట లంటూవుంటె ఆమర్యాదా నిలుస్తుందా మరి ?"

"నిలిచేచోట నిలుస్తుంది. నిలిపేవాళ్లు నిలుపుతారు. మర్యాదా అక్కరలేనివాళ్లూ, అదేమిటో యెరగనివాళ్లూ యేమి నిలుపుతారూ ?"

"అయితే, మర్యాదా కలవాళ్లు లేనివాళ్లతో సరిగా వెళ్ల వచ్చునా ?"

"పైవాళ్లయితే నువ్వన్నట్టే; కాని సంబంధం వుంది కదూ ? బతికివుండినంతకాలమూ వొక యింటోనే మగ్గిపోవాలి కదూ ? లేకపోతే వొకళ్ల గొడవ నాకేం ?"

"............"

"నాకొంపకే ముప్పు వచ్చి నే నేడుస్తున్నాను గాని——"

"నిండింటో కూచుని నువ్విలా అనవచ్చునా అమ్మా ?"

"అనక యేంచెయ్యను ? మాలకూడు తినమంటావా ?"

"............"

"సానికొంపా సంసారి కొంపా యిది ?"

"............"

"మొగవాడు అనాథ అయితే ఆడది నడివీధిలో భాగవతం కడుతుంది, అబ్బరమా ?"

"అమ్మా, అరికాళ్లకింద మంటలు పెట్టేస్తున్నావు"

"నామాట నీ కంత కష్టంగా వుందా నాయనా ? ఇదిగో, లెంపలు వాయించుకుంచున్నాను. అపరాధం వచ్చింది, క్షమించు"

"............"

"బుద్ధి గడ్డితిని నిన్ను కదిపాను, ఇక కిక్కురుమంటే అడుగు"

"............"

"ఇంకోమాటే గొడవ తెస్తే చెప్పుదెబ్బలు కొట్టు"

"............"

"మంచికి రోజులా నాయనా యివి ? పెళ్లాంగారు వచ్చాక యిక తల్లిముండ యెందుకూ ?"

"............"

"మంచీ చెడ్డా తెలుసుకోడానికీ, కీర్తి అపకీర్తి గుర్తించుకోడానికీ, యెవళ్లని దిద్దుకోవలసినట్టు వాళ్లని దిద్దుకోడానికీ యెంతటివాళ్లు కావాలి నాయనా? మొగాడయి పుట్టగానే సరా, చదువుకోగానే తీరిందా?"

"............"

"ఎన్నేళ్లు నిండితే యేమిటి సిగ్గూ భిడియమూ లేకపోయాక? ఇంతకీ: దేవుడు నా గొంతు కోశాడు. ఆమహారాజుని వుంచేసి నన్ను తీసుకుపోరాదూ? నాకీపాట్లు లేకపోవునే?"

"అమ్మా, యిందాకణ్ణుంచి సాధించేస్తున్నావు; పేగులు తోడేశావు; కాని వొక్క తప్పూ చూపించలేకపోయావు"

"అవునోయి నాయనా! నువ్వెంతవాడవైనాక యింకా నోరుతెరిచి—అయ్యో, నా బతుకా?"

"............"

"నా గ్రహాచారం కాకపోతే వెంకసోదెమ్మతో నేను కాశీ వెళ్లిపోయి వుండనూ?"

"............"

"దిక్కుమాలిన జన్మ, నాకు కాశీవాసంకూడా లభిస్తుందా? ఎంత పాపం చూడాలో, యెన్ని కళ్లు మాటలు వినాలో, యెన్ని తిట్లు తినాలో, యెన్ని చెప్పుదెబ్బలు పడాలో, అప్పుడే అయిందా?"

"............"

"ఎవళ్లు చేసుకున్న దెవళ్లనుభవిస్తారూ?"

"చెప్పవలసిందీ, చెప్పేదీ యేమయినా వుందా యింతేనా అమ్మా ?"

"ఉంటే మాత్రం యేమి లాభం నాయనా ? ఇప్పటి కయినా అభిమానం వచ్చిం దేమో అనుకున్నా, నం తే. చివరికి రొస్టు నాకా ? నలుగురి నోళ్ళలోనూ పడిపోడం నేనా ? అడ్డ మైన కుంకలూ నాకు చక్కట్లు దిద్దరావడమూ ?"

"............"

"ఇంతకంటే యీకొంప బాగుపడి యేడిస్తేనా ?"

"ఇక నే నాఫీసుకి వెళ్లిపోవచ్చునా అమ్మా ?"

"వెళ్లవచ్చు నాయనా, నిశ్చింతగా వెళ్లవచ్చు. కళ్లు మూసు కుంటే సరి. మొండివాడు రాజుకంటే బలవంతుడు ష"

"హు !..."

"ఓస్ ! దానిపేరు పౌరుషం కామోసు. ఇలాంటి వాజమ్మ లకే అలాంటిది ? గడ్డి తిన్నట్టు తిని, కుడితి తాగినట్టు తాగి— వుందనా లేదనా ? పూర్వపువాళ్లు ఇంత మట్టి సంపాదించి పోయారుకదా ?"

౨

"ఏమి వచ్చిం దేమిటి ?"

"............"

"అంతగా వెక్కి వెక్కి యేడవ్వాలసినంత పనేం జరిగిం దేమిటి ?"

"............"

"నాతో చెప్పకపోతే యెలాగా ?"

"నోట్తో చెప్పాలా సగం చచ్చి వుండీ కూడా ?"

"చెప్పకుండానే తెలుసుకోవచ్చు ఇంటో వుంటే. అయితే, యెంత దుఃఖకారణం యేర్పడ్డా కొంచెం సమాళించుకోవాలి, బారుమని యేడవడం ప్రయోజకత్వమా ?..."

"నామీద చెయ్యి వెయ్యకండి. నేను మాదిగదాన్ని. సాని పాపని"

"ఇష్టాలు లేనప్పు డెన్ని మాట లయినా వస్తాయి. అయినా—"

"నే నేమయినా అన్నానా ?"

"నువ్వే అన్నా వనలేదు"

"ఇద్దర్నీ సరిచేస్తున్నారా ?"

"............"

"ముందు కజ్జాకి సిద్ధపడ్డ కొంకనక్కని చెప్పుదెబ్బలు కొడతారా మీరు ?"

"............"

"పోనీ, ముందు నేను తగవు పెట్టడం యెన్న డయినా యెరుగుదురా మీరు ?

"............"

"నే నిక వేగలేను. నేను బతికివుండా లంటే నా కేదయినా దారి చూపించండి"

"...ఒక్కటే దారి"

"గోదా కదూ ? మీరలా అనక మరేమంటారు ?"

"ఇంతకీ, జరిగిం దేమిటి ?

"మీరు వినకుండా వున్నారా? నిజంగా మీకు తెలియ కుండానే వుందా?

"నీకష్టాలు వినలేదు కాదూ?"

"నా కష్టాలు వినా లని వుందా?"

"............"

"అవును, పెట్టిపుట్టందే సుఖా లెలా వస్తాయీ?"

"............"

"రామగామా! ఇంత దిక్కుమాలిన బతు కయిపోయిందా నాది?"

"చెప్పవు కాదూ?"

"బందరు వుప్పెన. రావడానికి మరేం వుంది, చెప్పడానికి మాత్రం కొత్తగా యేమి వస్తుంది?"

"ఎందుకు వచ్చిందీ?..."

"నాచెయ్యి వదలండి. నేను బతికివుండడమే కారణం. మరేం వుంటుందీ కారణం?"

"............"

"నాకర్మం కాలిపోయింది. నాఅవస్థ యింతట్లో తీరేదీకాదు, మానేదీ కాదు. తెల్లపోయి అలా కూచుంటారేం? కాఫీ చల్లారిపోతుంది పుచ్చుకోండి. తొరగా వెళ్లకపోతే అవతల మాటపడాలి, లేవండి"

"లేచి యేమిటి చెయ్యడం? ఇంటో యిలా రవులుతూ వుంటే నోటికి పోతుందా యేమయినా?"

"నన్నేనా అందర్నీ అడుగుతారా ఆమాట?"

"అడగవలసిన మనిషి నడుగుతాను. అడిగితే గ్రహించుకో గల మనిషి నడుగుతాను. తాబట్టిన కుందేటికి మూడే కాళ్లనే వాళ్లని అడిగేం లాభమూ"

"అయితే, యిక నాగతి యింతే ?"

"వోపిక పట్టు. ఆపదలు కాపరాలు చెయ్యవు"

"చాల్లెండి నేర్చుకుపోయారు మీ వేదాంతాలూ మీరూను. ఇప్పుడేనా మీరు "యింటో యిలా రవులుకుపోతూ వుంటే నోటికి పోతుందా" అనడిగారు ? పైనున్న మీకే అలా వుంటే, ఆ రవులుకుపోయేవాళ్ల కెలా వుండనూ? నల్లేరుమీద బండిలాగ వస్తూవుంటే దిక్కులేనివాళ్ల కెలా వుండనూ ?"

"............"

"అయ్యో, నీకింత గండకత్తెర వచ్చిందా అని వోదార్చ డాని కయినా తగనూనేనూ ?"

"............"

"నావాళ్లెవరూ దగ్గిర లేరనా యీలోకువ ?"

"............"

"నేనేమి పాపం చేశానూ ? నావాళ్లు మాత్రం యేమి లోపం చేశారూ ?"

"............"

"పెళ్లిలో అడిగినంత కట్నమూ, కోరినన్ని లాంఛనాలూ గుమ్మరించలేదూ ? అయిదు రోజులూ మొగాన కాసులు కొట్ట లేదా, యెదాన చీరలు పెట్టలేదా ? తానేమి చేసినట్టూ తన బతుక్కీ ?"

"............"

"పెళ్లిలోనే మొదలు ఏడిపించడానికి. ఊరంతా ముక్కు మీద వేలుపెట్టుకున్నారా రాగతనం చూసి. ఒక్క పూటయినా సంబరపడుతూ భోజనానికి వచ్చిన పాపాన పోతేనా? తిన్న అన్నం వంటపట్టనిస్తేనా?"

"............"

"కార్యంనాటికి మూలపడ్డా పులుసు విరగలేదు. ఒక్కటే ధోరణా జన్మ అంతా?"

"............"

"నన్ను చూస్తే అంత చిమచిమలాడిపోతాయేం కళ్లు? నేనేం విషం పెట్టానని?"

"............"

"తనకి నావంటివాళ్లు లేరూ? అంతకంటే నేనే విధంగా చెడ్డానూ? అడిగేవాళ్లు లేకగాని తన ఆశ వంటి ఆశ కాదూ అందరిదీ?"

"నాకేసి చూడదూ"

"నే నేడుస్తూ వుంటే చూడాలని వుందా?"

"............"

"అంత రాసి రంపాన పెడితే అదెలా బతుకుతుం దని అడక్కూడదూ?"

"ఇదివర కడగలేదూ?"

"నింపాదిగా అడిగితే మర్యాదా తక్కించుకునే వాలకమే అది?"

"కన్నతల్లి——"

"చేసుకున్న పెళ్లాన్నయితే కోసికోరత చెయ్యవచ్చు, కదూ?"

"నాభిదగ్గిరనుంచి వచ్చిన మాటనా అది?"

"నసాళం అంటుకుంటూ వుంటే నాభి లెక్కేమిటండీ? అటేడూ, యిటేడూ——పధ్నాలుగుతరాల నావాళ్లు దిక్కుమాలినవాళ్లయిపోతున్నారు, మరి, తన వాళ్లు?"

"ఎలాగో వోరగతోసుకువెళ్లకపోతే——"

"అయ్యో, నాబతుకు తెల్లవారిపోతే యింకా వోరగతోసుకుపోడం యెలాగండీ?"

"ఇదివరకటిలాగే——తప్పు నీమీద లేకుండా——"

"ఇంకేం? తప్పు నాది కానప్పుడంత మీదమీదకి రావడం యేమీ?"

"మళ్లీ మొదలా?"

"మళ్లీ యేమిటి, మళ్లీ యేమిటి, యెప్పటికప్పుడే మొదలు. ఎప్పటికయినా అంతం అంటూ వుంటేనా?"

"అలా అనకు"

"వాళ్లు మండుకుపోతూ వుంటే అనక ముద్దుపెట్టుకుంటానా? ఎన్నాళ్లనీ వోపికపట్టడం?"

"............"

"నావాళ్ల వూసెత్తడానికి తనకేం అధికారం వుందీ?"

"ఊరుకోవూ?"

"నాతమ్ముడు రేపు పెద్దవాట్టరయిపోతాడు, నీమువెళ్లినవాళ్లైవరయినా పుచ్చిపోయారా? తనవాళ్లే నీము వెళ్లగలిగివుంటే తానికకిందా మీదా వుండునా?"

"............"

"నావాళ్లెవళ్లూ రెయిళ్లలో టికెట్లు వసూలుచెయ్యడం లేదు, తెలుసా ?"

"నన్నయినా చూడవూ ?"

"మిమ్మల్ని చూస్తున్నాను కనకనే నాతిప్పలిలా వున్నాయి. తనతో సరిగా నేనూ తూర్పారబట్టే దాన్నయితే నాకీ గతేం?"

"ఇంకేం మరి ? వోపికపట్టడం తప్పు దని నీకే తెలిసినప్పు డీకాస్త మాత్రం యెందుకూ ?"

"సరే"

"లే, నా మాట విను. నాకు ఆలస్యం కానివ్వకు"

"ఉండండి, నన్ను వదలండి. నేను లేవగలను, మీరు వెళ్లి చేతులూ కాళ్లూ కడుక్కురండి"

"అన్నీ అయిపోయాయి. ఇక నువ్వు లేవడమే తరవాయి..."

"అబ్బా, వులిక్కిపడ్డానూ...నన్నిట్టే బుట్టలో పెట్టగలరు, అక్కడ మాత్రం కిమన్నాస్తి. ఏడ్చేదాన్ని నవ్వించినా, నవ్వేదా న్నేడ్పించినా నన్నే కాదూ ? ఒక్కమాటయినా నీకిది బుద్ధి కాదని అక్కడ చిక్కగా చివాట్లు పెడితే నాకీ కించలేకపోవును గాదూ ?"

"చూడూ"

"చూస్తూనే వున్నాను మీ అభిమానాలు"

"చివరి కదీ మాట"

"ఉన్నమాటంటే ఉలుకెక్కువ కొందరికి"

"ఉంటే యీ మెడమొగాలూ పెడమొగాలూ యెందుకూ?"

"పైవాళ్లు చూసి 'పాపం, కాబోలు' అనుకోడానికి"

"ఏదీ, నాకేసి చూస్తూ అనూ ఆమాట"

"పథ్యాలుగుమా ట్లంటాను, నాకేం భయమా ?"

"లేదసి నే నెరగనా ?"

"ఏమిటీ..."

"ఏమయితే యేమి లెద్దూ. చూడూ, గంతులు వేసేవాళ్లతో సరిగా గంతులు వెయ్యడం కాదు ప్రజ్ఞ. ఒక ల్లైగిరెగిరిపడేటప్పు డదటివా ళ్లూరుకుంటే తప్పెవరి దవుతుందీ ?"

"ఇక యెన్నయినా చెబుతారు మీరు కబుర్లు. అయితే లెండి, ఎప్పుడూ చీకటే వుంటుందా ?"

"అదీ మాట"

"ఇవాళ పొయ్యి అంటించాటప్పటికి కాలుదువ్వింది. మనసు మనసులో లేదు. జీడిపలుకులు మాడేపోయాయో వేగనే లేదో ? పకోడీలు పాకాన పడ్డాయో—"

"నీచేత్తో వండితే యెప్పుడూ అమృతోపమానంగానే వుంటుంది నాకు; నీమొగాన చిరునవ్వు మెరిసిపోతూ వుంటే ఎందులోనూ నాకు లోపమే కనపడదు"

"...ఏం, కమ్మగా వుందా ?"

"ఏం, మెచ్చుకున్నందుకా బుగ్గపోటు ? అయితేలే, కామ శాస్త్రకర్తలు దీనిమీద చాలా గ్రంథం పెంచారు. ఏమయినా, వార్షికమేఘం శరన్మేఘంగా మారిపోయింది, నాకదే పదివేలు. నా మనస్సిప్పటికి కుదుటపడింది"

"అవునవును, ఎదటివాళ్లుసూరుమంటూ వుంటే కొందరి కానందం. ఆమహాతల్లి బిడ్డలు కారూ ?"

"మళ్లీ యిలా తిప్పావూ చక్రం ?...ఇంకెందుకూ నాకూ ? అయితే, కభుర్లేనా నువ్వేమయినా—"

"నా మొగాన చిరునవ్వు మెరిసిపోతూ వుంటే మీ కన్నీ బాగానే వుంటా యన్నారు, మీ రుల్లాసంగా వుంటే నాకడుపు నిండిపోదూ ?"

"హాయిహాయి, రత్నాల మూట, వెలకట్టగలమా ఆమాటకి ? గాంధారణ్యంలోనుంచి నందనోద్యానంలో పడ్డట్టుంది నాకు—ఏదీ వొక్క—"

1930 జూన్ భారతినుంచి.

(సవరణలతో)